## క్లుప్తంగా

### 16న బ్రాహ్మణపల్లిలో జేసీఎస్ సమావేశం

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** ఆత్మకూరు నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ బాధ్యులతో ఈ నెల 16న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారని మేకపాటి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వైఎస్సార్‌సీపీ కల్పించే బీమా సౌకర్యం వివరాలు వివరిస్తారన్నారు. సమావేశానికి హాజరయ్యే వారు తమ వెంట ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను ఏదో ఒక ఐడీ ప్రూఫ్ వెంట తీసుకొని రావాల్సిందిగా కోరారు. నియోజకవర్గంలోని మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

### నేడు రాజుపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం

**కలిగిరి:** కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ రాజుపాళెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

### స్త్రీశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు

**ఆత్మకూరు:** స్వాతంత్య్ర దినోత్సవం రోజున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నాగరాజుతో పాటు పలువురు యువజన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 50 మంది మహిళలతో స్త్రీశక్తి కార్యక్రమాన్ని జెండాలతో ప్రదర్శనను నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వైద్య ఖర్చులకు రూ. 50 వేలు ఆర్థిక సహాయం



**ఉదయగిరి:** మండలంలోని గండిపాళెంకు చెందిన కంకి చిన్నక్క మనుమరాలు అన్నమనేని అనూష అనారోగ్యంలో తిరుపతిలో చికిత్స పొందుతోంది. అనూష వైద్య ఖర్చుల నిమిత్తం జీఎంకే ట్రస్ట్ అధినేత గంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ. 50 వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. భవిష్యత్‌లో మరింత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బుడగుంట్ల వెంకటేశ్వర్లు, షేక్ గఫూర్, గోసు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### గీత కార్మికుడికి ఆర్థిక భరోసా



**చేజర్ల(సోమశిల):** అనంతసాగరం మండలంలోని కమ్మవారిపల్లికు చెందిని గీత కార్మికుడికి గౌడ సేవ సమితి తరఫున ఆదివారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన ముక్కు వజ్రయ్య ఇటీవల ఈత చెట్టు గీస్తూ ప్రమాదవశాత్తు కింద పడి నడుముకు తీవ్రగాయమైంది. ఆదివారంలోని వజ్రయ్య నివాసంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖరరెడ్డి, కోసూరు పెంచలయ్యగౌడ్, కామేశ్వరావుగౌడ్, నారాయణగౌడ్, చినగోవిందయ్యగౌడ్, నరసయ్యగౌడ్, గ్రామ సొసైటీ ప్రెసిడెంట్ ముక్కు కొండలరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

**వింజమూరు (ఉదయగిరి):** మండలంలోని కోకవారిపాళెం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై వింజమూరు పోలీసులు ఆదివారం దాడి చేశారు. 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 30,170 నగదును స్వాధీనం చేసుకున్నారు.

# తమ్ముళ్ల అంతర్యుద్ధం

**కావలి అసెంబ్లీ స్థానానికి టీడీపీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తేలలేదు. ఇప్పుడెవరెవరో అభ్యర్థి నేనంటే నేనంటూ ప్రచారం చేసుకుంటున్నారు.. రేపటికి ఎవరొస్తారో తెలియదు. అభ్యర్థిత్వం కోసం ఇప్పటికే ముగ్గురు కృష్ణులు తెరపైకి వస్తే.. తెర వెనుక నుంచి దళారీ పాత్ర షాడో నేత రాజకీయం నెరుపుతున్నాడు. టికెట్ ఇవ్వకుంటే తాను పెట్టిన పది కోట్ల రూపాయలు పార్టీ తనకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం రావడంతో కావలి టీడీపీలో రాజకీయ రంజుగా మారింది.**



- కావలి టీడీపీ నావికుడి లేని నావ
- ఆధిపత్యం కోసం నిత్యం కుమ్ములాట
- టికెట్ ఇవ్వకుంటే పెట్టిన ఖర్చులు ఇచ్చేయాలని మాలేపాటి డిమాండ్
- బరిలో నేనంటే నేనే అంటూ మాలేపాటి, కావ్య, పసుపులేటి
- తెర వెనుక నుంచి షాడో దళారీ పాత్ర

**కావలి:** కావలిలో టీడీపీకి క్యాడర్ లేదు.. ప్రజాబలం అంతకంటే లేదు. 2019 ఎన్నికల తర్వాత పూర్తిగా కనుమరుగు అయింది. దీంతో మూడున్నరేళ్లుగా ఆ పార్టీకి రథసారథే లేని పరిస్థితి. ఈ పరిణామాలతో ఆ పార్టీ అభిమానులు సైతం దాదాపుగా ఆ పార్టీకి దూరమయ్యారు. సరైనా నాయకత్వ పటిమలేని నేతలు లేకపోవడంతో నాయకత్వం, యవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారారు. కావలిలో తమ్ముళ్ల మధ్య అంతర్యుద్ధం తారాస్థాయికి చేరింది. ఆధిపత్యం కోసం కుమ్ములాటలు అధిష్టానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కావలి టీడీపీలో పట్టుమని పది మంది కూడా వార్డు స్థాయి నాయకులు లేరు. వీరిలో కొందరు ఆ పార్టీలో రాష్ట్ర స్థాయి పదవుల్లో, ఇంకొందరు జిల్లా స్థాయి పదవుల్లో కొనసాగుతుండడం గమనార్హం. కావలి టీడీపీలో అందరూ నాయకులు.. పెత్తందారులే. అయితే ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పరంగా అధిష్టానం ఏ కార్యక్రమానికి పిలుపుఇచ్చినా రూపాయి ఖర్చు చేయడానికి ముందుకురాని పరిస్థితి. ఈ పరిణామాల్లో కావలి నియోజకవర్గంలో టీడీపీని నడిపించేందుకు ఇన్‌చార్జిగా మాలేపాటి సుబ్బానాయుడును నియమించినప్పటికీ, ఆయన్ను పార్టీ ఇప్పటికీ గుర్తించడం లేదు. పార్టీ అవసరాన్ని బట్టి పేకలో జోకర్ ముక్కగానే వాడుకుంటున్నారు.

**పట్టులేని మాలేపాటి**

మూడున్నరేళ్లుగా కావలిలో పార్టీకి నాయకత్వ దిక్కు దివాణా లేని సమయంలో ఏడాది క్రితం కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మాలేపాటి ఇటు ప్రజల్లోనూ, అటు పార్టీ క్యాడర్‌లోనూ పట్టుసాధించలేకపోయారు. తనకంటూ వర్గాన్ని కూడా సృష్టించుకోకపోయాడు. ఇతన్ని ఒక ఏటీఎంగా వాడుకుంటున్నారు. పార్టీ ఇన్‌చార్జి అని చెప్పుకునేందుకు అప్పుడప్పుడు నలుగురిని గల్లీ లీడర్లను వెంటేసుకుని హడావుడి చేస్తూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాడు. పార్టీ కోసం తాను ఒక్కడినే కష్టపడి పని చేస్తున్నట్లుగా భ్రమ కల్పిస్తుంటారు.

**ట్రస్టుల పేరుతో రాజకీయం**

ఇకపోతే ట్రస్టుల పేరుతో ప్రజలను ఆకర్షించేందుకు మరో ఇద్దరు నాయకులు తెరపైకి వచ్చారు. కావలి ప్రజలకు ఎన్నో సేవలు అందించినట్లు, దాంతోనే వారు బాగుపడినట్లు గొప్పలు ప్రచారం చేసుకుంటున్న వారిలో దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి), పసుపులేటి సుధాకర్ రాజకీయాలు చేస్తున్నారు. టీడీపీ టికెట్ కోసం అసలు ఆ పార్టీకి ఎటువంటి సంబంధాలు లేని వీరిద్దరు ఏకంగా పార్టీ అధినేత చంద్రబాబును కలిసి పైరవీలు చేస్తున్నారు. అయితే పార్టీ క్యాడర్‌ను కాదని వీరు డైరెక్ట్ వ్యవహారాలు టీడీపీ శ్రేణులకు మింగుడు పడడంలేదు.

**షాడో నేత దళారీ రాజకీయం**

పార్టీలోనే దళారీ పాత్ర పోషిస్తున్న షాడో నేత కనుసన్నల్లోనే కావలి పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న ఆర్థికంగా స్థితిమంతులైన కొత్త ముఖాలను చంద్రబాబుతో కలిసేలా రాజకీయం చేస్తున్నాడు. రేపటి తన రాజకీయ అవసరాలకు నోట్ల కట్టలు సిద్ధం చేసుకుంటున్నాడనే ఆరోపణలు ఆ పార్టీ నేతలే బాహాటంగా చెప్పుకుంటున్నారు. డబ్బుందనే ఒకే ఒక్క అంశం ప్రాతిపదికపై పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు అసెంబ్లీ టికెట్ ఇస్తే, తాను అంగీకరించేది లేదని పార్టీ స్థానిక క్యాడర్‌లో నివురు గప్పిన నిప్పులా పరిస్థితులు మారాయి. టీడీపీ ఆశావహులు కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్ కావలి ప్రజలకు ట్రస్టుల పేరుతో చేసిన సేవలంటూ ఏమీ లేవని మాలేపాటి సుబ్బానాయుడు ప్రచారం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా మాలేపాటి సుబ్బానాయుడు పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న ఏడాది కాలంగా సుమారు రూ.10 కోట్లు ఖర్చు పెట్టినట్లుగా, అది తనకు చెల్లించాలని అడుగుతున్నట్లుగా పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న కొత్త వ్యక్తి చెప్పినట్లుగా ఆయన కోటరీలోని కొందరు ప్రచారంలో పెట్టారు. దీంతో మాలేపాటి ఊగిపోతూ తాను తానే కావలి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానే కానీ, ఎవరికి కొమ్ము కాయని ప్రతిజ్ఞలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్ మనస్తత్వాలు తెలిసిన టీడీపీ శ్రేణులు వీరి గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఈ పరిణామాలు చూస్తూ ఉంటే పార్టీ నాయకుల్లో అంతర్యుద్ధం ప్రారంభమనట్లుగా స్పష్టంగా కనిపిస్తోంది.

# జగనన్న పాలనతో రాష్ట్రం సుభిక్షం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బుక్ లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 26వ వార్డులో ఆదివారంగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. వార్డులోని ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించి, ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి సంక్షేమ పథకాలు, అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అధికారంలోకి రాక మునుపు ఏవైతే హామీలు ఇచ్చారో వాటన్నిటినీ ఒక వరుస క్రమంలో నవరత్నాలు పేరుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారని చెప్పారు. ఒక వైపు సంక్షేమ కార్యక్రమాలు, మరొక వైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రెండింటినీ రెండు కళ్లుగా భావించి అమలు పరుస్తున్నారన్నారని వివరించారు. జగనన్న చేపట్టిన కార్యక్రమాలు ఏ విధంగా ప్రజలకు చేరువయ్యాయో తెలుసుకునేందుకు, క్రమపద్ధతిలో ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి అర్హత కలిగిన లబ్ధిదారులను జల్లెడ పట్టేందుకు వీలవుతుందని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక సమస్యల వల్ల లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందాల్సిన కార్యక్రమాలు అందకపోతే అక్కడికక్కడే పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సాధ్యపడుతుందన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అంతే పారదర్శకంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. 2020లో ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కరోనా మహమ్మారి ప్రభావం రాష్ట్రంపైనా పడి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. సంక్షేమ పథకాలతో అమలుతో పాటు కరోనాను సమర్థంగా ఎదుర్కొన్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. మేనిఫెస్టోను ఇంత చిత్తశుద్ధితో అమలు చేసిన ప్రభుత్వాలను మనమెన్నడైనా చూశామా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో గెలవడానికి చంద్రబాబు 600 పైగా హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోనే మాయం చేసిన చరిత్రను ప్రజలు మరిచిపోరన్నారు. ప్రధానమైన పొదుపు రుణాలు, రైతు రుణ మాఫీ పేరుతో ఎంతగా వంచించారో ఆ బాధితులకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నగళ్ల శ్రీనివాసకిరణ్, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రసూన, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్ హమీద్, కనుపర్తి రాజశేఖర్, దేగా రామయ్య, పుల్లా శ్రీనివాసులురెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, వంశీరెడ్డి, కృష్ణారెడ్డి, వేణురెడ్డి, తిరువీధి ప్రసాద్, నాగేశ్వరమ్మ తదిరులు పాల్గొన్నారు.

# కలవర పెడుతున్న కండ్లకలక


కండ్ల కలక శోకిన వారి కంటి భాగం

**ఆత్మకూరురూరల్:** గాలి ద్వారా వ్యాపిస్తున్న వైరస్ వల్ల మండలంలోని పలు గ్రామాల్లో కండ్ల కలక అధికంగా ఉంది. కళ్లు మంటలతో పుసురుగట్టి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కండ్లకలక బాధితులు ఆరోగ్య జాగ్రత్తలపై ఆత్మకూరు మండల వైద్యాధికారి ఆర్.రాకేష్ ఆదివారం మాట్లాడుతూ కండ్ల కలక శోకిన వారు తమ కండ్ల నుంచి కారే నీటిని శుభ్రమైన తడిబట్టతో తరచూ శుభ్రపరుచుకోవాలని, చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవాలి. ఉతికిన టవల్స్, ఖర్చీఫ్‌లను మాత్రమే వినియోగించాలి. కండ్ల కలక తగ్గే వరకు కళ్లజోడు పెట్టుకోవాలన్నారు. అప్పటికీ నయం కాకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు. కండ్ల కలక ఉన్న వారి కళ్లల్లోకి చూడడం వల్ల ఈ వ్యాధి శోకే అవకాశంలేదని, వారి కళ్లను తాకిన చేతితో ఇతరులు స్పృశిస్తే కండ్ల కలక వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి బాధితులు చేతితో కండ్లను నలపకుండా నల్లటి అద్దాలు, వినియోగిస్తూ తగు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ఆకుకూరలు, విటమిన్ ఏ కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు.

# ప్రమాదకరంగా కేతామన్నేరువాగు బ్రిడ్జి


ప్రాణాంతకంగా ఉన్న కేతామన్నేరు వాగు బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న లారీలు


కదిరినాయుడుపల్లి వద్ద కేతామన్నేరువాగు బ్రిడ్జి స్లాబులకు మధ్య చీలిపోయి ఉన్న దృశ్యం

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద 67వ నంబరు జాతీయ రహదారిలో కేతామన్నేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ప్రతి రోజు జాతీయ రహదారిపై వందలాది వాహనాలు ఈ బ్రిడ్జి మీదనే రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారుల శాఖ అధికారులు పలుమార్లు ఇక్కడ పరిశీలించినప్పటికీ నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు వెళ్లిన ప్రతిసారి బ్రిడ్జి కుదుపులకు లోనవుతుండడంతో అందులో ప్రయాణిస్తున్న వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వేగంగా స్పందించి ఎటువంటి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.

### ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి



**ఆత్మకూరురూరల్:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ మరింత వేగవంతం చేయాలని మర్రిపాడు ఆర్‌వో సురేంద్ర తెలిపారు. మండలంలోని 43 పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలోని చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, 0 నంబరు ఇంటి అడ్రస్సు ఉన్న వారు, ఓటరు జాబితాల నుంచి తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌బాక్స్ పోస్టర్లు ఆవిష్కరణ



**ఉదయగిరి:** ఐడీఎల్ యూత్ మూవ్‌మెంట్ ఉదయగిరి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో జాబ్‌బాక్స్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు షేక్ జిందాదుల్లా మాట్లాడుతూ యువతలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే ధ్యేయంగా ఐవైఎం జాబ్‌బాక్స్ పని చేస్తుందన్నారు. యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి సంబంధించిన సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌యూసఫ్, సాజీద్, ఇమ్రాన్, సిద్ధిక్ పాల్గొన్నారు.

## మంత్రి ధర్మానను కలిసిన వీఆర్వో నేతలు


మంత్రి ధర్మాన ప్రసాద్‌రావును కలిసిన వీఆర్వో సంఘం నాయకులు

**కావలి:** రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావును నెల్లూరు జిల్లా వీఆర్వో నాయకులు రెండు రోజుల క్రితం కలిశారు. వీఆర్వోల సమస్యలపై రాష్ట్ర నాయకులు పిలుపు మేరకు మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించినట్లు చెప్పారు. గ్రేడ్‌-2 వీఆర్వోలకు ప్రొబేషన్‌ను త్వరితగతిన ఎటువంటి షరతులు లేకుండా డిక్లేర్ చేయాలని మంత్రి కోరారు. గ్రేడ్‌-1లకు ప్రమోషన్‌లో 70 శాతం అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న వీఆర్వో లకు జూనియర్ సహాయకులుగా నియమించాలని, ఇతర ముఖ్యమైన సమస్యలపై రెవెన్యూ శాఖ మంత్రికి వినతిపత్రం ద్వారా వివరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఏవీవీ ప్రసాద్, జిల్లా నేతలు గిరిధర్‌రెడ్డి, జనార్థన్, చందు, పేరయ్య, హరిబాబు పాల్గొన్నారు.

## వైభవంగా భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు


భక్తులను ఆశీర్వదిస్తున్న పూజారి

**చేజర్ల:** భగవాన్ వెంకయ్యస్వామి జన్మస్థలమైన మండలంలోని నాగులవెలటూరులో కొలువైన వెంకయ్యస్వామి ఆశ్రమంలో మూడు రోజుల పాటు జరిగిన ఆరాధనా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ప్రతి రోజూ స్వామి నామసంకీర్తనను భక్తులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి భజన బృందం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ కమిటీ చైర్మన్ వేలూరు కేశవచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆరాధనా మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లను చేపట్టారు.

# వీరులకు వందనం


మాజీ సైనికులను, వారి కుటుంబ సభ్యులను సన్మానించిన దృశ్యం

**ఆత్మకూరు:** అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆత్మకూరుకు చెందిన క్రైడ్, ఆర్‌పీడీఎస్ తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో దేశరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన వీర జవానులకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. జిల్లా సైనిక అధికారి ఓ రమేష్ మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణకు చేసిన సేవలు మరువలేనిదని, వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. సైనికులు, మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పలు రెవెన్యూ సమస్యలను భూ, నివేశ స్థలాల కేటాయింపు, సైనిక పిల్లలకు రిజర్వేషన్, తదితర సమస్యలపై తాము నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికులను, మృతి చెందిన సైనికుల కుటుంబాలకు చెందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఎస్‌ఆర్‌జేడీ కళాశాల ప్రిన్సిపల్ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, క్రైడ్ సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, ఆర్‌పీడీఎస్ నిర్వాహకులు సిద్ధం పెంచల నరసయ్య, వెలగపాటి వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ సిబ్బంది సాధిక్ హుస్సేన్, రొట్టె వెంకటేశ్వర్లు, సైనిక సంక్షేమ సంస్థ అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని అర్హత


రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు

**కలిగిరి:** జాతీయ స్థాయిలో నిర్వహించే షాట్‌బాల్ చాంపియన్ షిప్‌–2023 టోర్నమెంట్‌లో పాల్గొనడానికి కలిగిరి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని ఎస్.మౌనిక అర్హత సాధించారని ప్రిన్సిపల్ సుప్రియ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎస్‌ఎల్‌ఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి షాట్‌బాల్ చాంపియన్ షిప్‌–2023 పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో నెల్లూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టులో పాల్గొన్న తమ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మౌనిక గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. అక్టోబర్‌లో మొదటి వారంలో జైపూర్‌లో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మౌనిక ఉపాధ్యాయులు, సహచర విద్యార్థినులు ప్రత్యేకంగా అభినందించారు.

## తెలుగు ఉపాధ్యాయుడికి తెలంగాణ పురస్కారం


కాకతీయ విశ్వవిద్యాలయంలో పురస్కారం అందుకుంటున్న శివశంకరయ్య

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయంలో 76వ స్వాతంత్య్ర దినోత్సవాల్లో సందర్భంగా మర్రిపాడు మండలం చుంచులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మున్నెల్లి శివశంకరయ్యకు ఆదివారం కాకతీయ వైభవ పురస్కారం అవార్డు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సంగీత, నాట్య అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి, స్థానిక ఎమ్మెల్యే దాశ్యం వినయ్‌భాస్కర్, శత కవి చిగురుమళ్ల శ్రీనివాస్, విశ్వవిద్యాలయ ఆచార్యులు వినయ్, తదితరులు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. రచయితలు, సంఘ సేవకులకు అందించే ఈ అవార్డుకు ఆంధ్రప్రదేశ్ నుంచి తనను ఎంపిక చేసి గౌరవించిన కాకతీయ వైభవ కీర్తి పురస్కారాల కమిటీకి ఈ సందర్భంగా శివశంకరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# త్యాగధనులకు రుణపడి ఉందాం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

**అల్లూరు:** మాతృభూమి కోసం సర్వస్వం త్యాగం చేసిన త్యాగధనులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని పురిణి సర్పంచ్ మైనంపాటి స్వాతి అన్నారు. ఆదివారం మండలంలోని పురిణిలో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి దేశం కోసం పోరాడిన వీరులను గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానించారు. శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శిద్దేశ్వరి, ఉప సర్పంచ్ తాండ్ర శ్రీనివాసులు, నాయకులు తాండ్ర మల్లికార్జున, వార్డు మెంబర్‌లు, సచివాలయ కన్వీనర్, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఆంధ్ర ప్రీమియర్ లీగ్' మార్చ్



జెండా ఊపుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** ఆంధ్ర ప్రీమియమ్ లీగ్ (ఏపీఎల్) సీజన్‌–2కు సంఘీభావం తెలియజేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన 'ఏపీఎల్ మార్చ్'కు స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియం లో ఈ నెల 16వ తేదీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీసీఐ అనుమతి పొందిన ఏపీఎల్ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ తీసుకువచ్చి రాష్ట్రంలో యువతీ యువకుల్లో క్రికెట్ క్రీడలపై సానుకూల వాతావరణం తీసుకురావడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతీ యువకుల్లో ఉన్న సృజనాత్మక అంశాలకు నైపుణ్యం జత చేయాలనే పటిష్టమైన ఆలోచనలకు అనుగుణంగానే ఏపీఎల్ అలాంటివి ఉద్భవించాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఏపీఎల్ మార్చ్ స్థానిక ఎమ్మెల్యే నివాసం నుంచి ట్రంక్‌రోడ్డు మీదుగా ఉదయగిరి రోడ్డులోని స్టేడియం ప్రతిపాదిత స్థలం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీఎస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నగళ్ల శ్రీనివాసకిరణ్, సీనుబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.